క్లుప్తంగా

గ్రీవెన్స్ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు: పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ప్రజల సమస్యలు తప్పకుండా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొని సమస్యలు పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. పార్టీ ఆదేశాల ప్రకారం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, తహసీల్దారు సుశీల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుపై విచారణ

రేపల్లె రూరల్: తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారంటూ రేపల్లె మండలం బొబ్బర్లంక గ్రామానికి చెందిన నంబూరి అగ్ని, పద్మ దంపతులు ఇటీవల జిల్లా గ్రీవెన్స్‌లో కలెక్టర్ వెంకట మురళికి ఫిర్యాదు చేయటంతో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకర్ బుధవారం విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బొబ్బర్లంక ఎస్టీ కాలనీకి చేరుకుని నంబూరి అగ్ని, పద్మ దంపతులను విచారించి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



కొల్లూరు : రెవెన్యూ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే లబ్ధిదారులు వేసవిలో మంచినీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కొల్లూరు తహసీల్దారు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచినీటిని సరఫరా చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలి

డీఎల్‌పీఓ స్వరూపరాణి



కొల్లిపర: ప్రతి పంచాయతీలోని కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు విషయంలో తప్పకుండా వందకు వంద శాతం పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి కోట స్వరూపరాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంటి పన్నులు వసూలు విషయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి 31లోపల వందకు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 గ్రామ పంచాయతీలకు గాను 8 పంచాయతీలలో మాత్రమే వంద శాతం పన్నులు వసూలు చేసి ఎటువంటి అవకతవకలు లేకుండా ఖజానాకు చెల్లించటం జరిగిందన్నారు. అదే విధంగా మిగిలిన అన్ని గ్రామాల్లోని కార్యదర్శులు కూడా కృషి చేయాలని కోరారు. గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పూర్తిగా వినియోగించుకోవాలని, వేసవి కాలంలో మంచి నీటి చేతి పంపులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కిట్స్ వివరాలు నమోదు చేసుకోండి

తెనాలిఅర్బన్: విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కిట్స్ పర్యవేక్షణ జిల్లా కో-ఆర్డినేటర్ బెల్లంకొండ చక్రవర్తి, మనబడి-మన భవిష్యత్ కార్యక్రమ అసిస్టెంట్ ఇంజినీర్ సి.హెచ్. నాగేంద్రలు సూచించారు. తెనాలి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్‌ను బుధవారం వారు పరిశీలించింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, మూడుజతల ఏకరూప దుస్తులు,బూట్లు, బ్యాగ్ తదితర వస్తువులను జూన్ నాటికి అందించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పంపిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వస్తువుల బద్రతకు అవసరమైన సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వై జయంతి బాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారని మురుగు.. క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

పట్టణంలో అధ్వానంగా నిర్వహణ

- మురుగు నీటి నిల్వలతో వృద్ధి చెందుతున్న దోమలు
- తూతూ మంత్రంగా చర్యలు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

రేపల్లె రూరల్: పట్టణంలో దోమల దండయాత్రతో ప్రజలు బెంబేలెత్తిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పగలురాత్రి తేడా లేకుండా దోమకాటుతో విలవిలలాడుతున్నారు. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చేపడుతున్న చర్యలు తూతూ మంత్రంగానే ఉంటున్నాయి. దీంతో పాటు డ్రెయిన్‌ల నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో దోమలు వృద్ధి చెందేందుకు మురుగు కాల్వలు ఆవాస కేంద్రాలుగా మారాయి. పట్టణంలోని నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలలో దోమల వృద్ధి చెందుతున్నాయి. పారిశుధ్య క్షీణతతో పాటు కదలని మురుగుతో వృద్ధి చెందుతున్న దోమలతో పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచి దోమల నివారణపై శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



నేతాజీనగర్ వద్ద వాడ మురుగు డ్రెయిన్‌లో కదలని మురుగు

దుర్గంధ భరితం

పట్టణంలో పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. ప్రధాన వీధులు మినహా అంతర్గత రహదారులు, మురికివాడల్లో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి రహదారుల వెంట చెత్త నిలవలు ఉండడంతో పందుల సంచారం అధికమైంది. చెత్త నిలవలు అధికమవడం పందుల సంచారం పెరగడంతో ఆయా ప్రాంతాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు.



మోంట్‌ఫోర్ట్ స్కూలు రోడ్డులో ప్రధాన డ్రెయిన్ దుస్థితి

రహదారులపైనే మురుగు

పట్టణంలో డ్రెయిన్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రెయిన్లు నిండిపోవడంతో మురుగునీరు పారుదలకు ఆటంకం తప్పడం లేదు. రోజుల తరబడి మురుగు నీరు పారుదల లేకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రధానంగా వాడమురుగు డ్రెయిన్, రేపల్లె డ్రెయిన్‌లు చెత్త చెదారం, గుర్రపు డెక్కతో పూర్తిగా నిండిపోయాయి. రోజుల తరబడి మురుగునీరు పారుదల లేకపోవడంతో పలు వార్డుల్లో మురుగునీరు పొంగి రహదారులపైకి చేరుతోంది. 23వ వార్డులోని పలు రహదారులు, రామకోటిపేటలోని రహదారుల్లో మురుగునీరు రహదారులపైకి చేరిన దృశ్యాలు గత పది రోజుల నుంచి కనిపిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా వార్డుల నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రామకోటిపేటలో సీసీ రోడ్డుపైకి చేరిన మురుగు

తూతూ మంత్రంగా ఫాగింగ్

దోమల నివారణకు డ్రెయిన్‌లలో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ నిర్వహించటం వంటివి తూతూ మంత్రంగా నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు విన వస్తున్నాయి. ఫాగింగ్ నిర్వహణకై ఇటీవల కొనుగోలు చేసిన వాహనం మొదట్లో ఆర్భాటంగా పట్టణంలో తిప్పినా.. ప్రస్తుతం పక్కన పడేసారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచటం, దోమల వృద్ధి నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు, ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక చర్యలు చేపడతాం

పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక వాహనం ద్వారా వార్డులలో ఫాగింగ్ నిర్వహించటంతో పాటు మురుగు కాల్వల్లో లార్వా చంపేందుకు ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నాం. డ్రెయిన్‌లలో మురుగునీరు పారుదల అయ్యేలా పారిశుద్ధ్య సిబ్బందితో చర్యలు చేపడతాం.

– ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రేపల్లె

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె రూరల్: ప్రజలపై భారం మోపుతూ కేంద్రం ఆచరిస్తున్న విధానాలకు స్వస్తి పలకకుంటే ఉద్యమాలు తప్పవని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నెహ్రూ బొమ్మ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్యాస్ ధర కొంతమేర తగ్గించి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలపై భారం మోపుతోందన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచటమంటే ప్రజలపై గుదిబండ మోపినట్లేనన్నారు. రాష్ట్రంలో బీజేపీ కూటమిలో భాగంగా అధికారంలో ఉన్న ప్రభుత్వానికి కూడా ఈ గ్యాస్ ధర పెంచిన పాపంలో భాగస్వామ్యం ఉందన్నారు. దేశంలో అదానీ లాంటి కార్పొరేట్ వ్యాపారవేత్తలకు వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తూ కష్టజీవులు, పేదలు రోజు ఉపయోగించుకునే గ్యాస్ వంటి వాటి ధరలు పెంచడం సిగ్గుచేటన్నారు. పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ ఇస్తామని గొప్పలు చెప్పుకొన్న కూటమి పెద్దలు కేంద్రాన్ని ప్రశ్నించాలన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్‌పై సుంకాన్ని రద్దు చేయాల్సిందిపోయి పెంచటం ఏమిటని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు తగ్గించకపోవడం ప్రజలను వంచించడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేసి పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు కేవీ లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం, వై.కిషోర్, కె.గోపి, కె.రమేష్, నాంచారమ్మ, డి.అగస్టిన్, జి.దానియేలు, డి.బాబురావు, వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

రేపల్లె రూరల్: స్వచ్ఛంద సేవా సంస్థలు నిస్వార్థంతో ప్రజలకు సేవలు అందిచేందుకు ముందుండటం అభినందనీయమని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సెంటరులో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనసంచారం అధికంగా ఉండే ప్రదేశంలో చలివేంద్రం ఏర్పాటు చేయటం గర్వించదగిన విషయమన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా ప్రభుత్వానికి ఉపశమనం కలుగుతుందన్నారు. అనంతరం ప్రజలకు చలివేంద్రంలో ఏర్పాటు చేసిన పానకం పంపిణీ చేశారు. పారిశుధ్య పరిరక్షణలో తనదైన సేవలు అందిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావును సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కాశేపల్లి ఈశ్వరరావు, సెక్రెటరీ తడికమళ్ళ బాబు, వైస్ ప్రెసిడెంట్‌లు పొన్నూరు శ్రీనివాసరావు, తుమ్మలపల్లి శివ, కోశాధికారి తూనుగుంట్ల రాజేష్, సహ కోశాధికారి గుర్రం సురేష్, నాయకులు సుగ్గుల సుదర్శనరావు, మహేష్, హారిక తదితరులు పాల్గొన్నారు.



వలసలు నివారించాలి

కర్లపాలెం: గ్రామాలలో ప్రజలు పనుల కోసం వలసలు పోకుండా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉన్నదని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెంలో లంక కాలువ సమీపంలో బుధవారం జరిగిన ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి పనులు నాణ్యతగా చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు రోజువారీ వేతనం రూ.307 వచ్చే విధంగా కొలతల ప్రకారం పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు చెప్పారు. ప్రతి కూలీ 15 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు, అడుగు లోతు కొలతలతో బోది కాలువలు తవ్వాలని సూచించారు. వేసవికాలం కావటం వలన కూలీలు ఉదయాన్నే పనులు పూర్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు, కూలీలు ఉన్నారు.



కర్లపాలెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

వేసవి దుక్కులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

తెనాలిటౌన్: వేసవి దుక్కులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డా.వెంకటలక్ష్మి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఏరువాక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఏరువాక కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డా.వెంకటలక్ష్మి పాల్గొని మాట్లాడారు. దుక్కి లోతుగా దున్నడం వల్ల భూమి గుల్ల బారి సారవంతంగా మారుతుందని తెలిపారు. తద్వారా మొలక శాతం పెరుగుతుందని రైతులకు వివరించారు. దుక్కి దున్నే విధానంపై రైతులకు ఏ విధంగా వివరించాలో విద్యార్థులకు సూచించారు.అనంతరం గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యన్ ఎస్ ఎస్ క్యాంపు ఇన్‌చార్జ్ డా.సువర్ణలత, డా.సంధ్యారాణి, రైతులు రోశయ్య, అప్పారావు, రామ్మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం చేయూత

అమర్తలూరు(వేమూరు): రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తే ప్రభుత్వం చేయూత అందిస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ అధికారి వి.నాగశ్రీ అన్నారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు రైతు సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ న్యాచురల్ ఫార్మింగ్ ప్రణాళిక గురించి మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. న్యాచురల్ ఫార్మింగ్ కింద పని చేయుచున్న సీఆర్‌పీడబ్ల్యూ, ఐసీఆర్‌పీలకు, వ్యవసాయ శాఖ సహాయకులకు శిక్షణ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందిస్తూ వారితో పాటు కొత్తగా ప్రకృతి వ్యవసాయం చేయుటకు రైతులను ప్రోత్సహించాలని ఆమె సిబ్బందికి సూచించారు. మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల ద్వారా ఎక్కువ మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయుటకు బ్యాంక్‌ల ద్వారా ఆర్థిక సహాయం చేయగలమన్నారు. మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయు రైతులను ఈ పంట నమోదు చేయటం ద్వారా గుర్తించి వారికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించుటకు వ్యవసాయ సహాయకులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డిపాటి హేమచంద్ర శ్రీనివాస్, ఏపీఎం రాంబాబు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, న్యాచురల్ ఫార్మింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ సాగుపై శిక్షణ కార్యక్రమంలో వి.నాగశ్రీ

ఆటో నుంచి పడి మహిళకు గాయాలు



చందోలు(కర్లపాలెం): ఆటోలో ప్రయాణం చేస్తున్న ఓ మహిళ జారి రోడ్డుపై పడి గాయాలవటంతో చందోలు ఎస్ఐ స్పందించి ఆమెను వైద్యశాలకు తరలించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. చందోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు అమర్తలూరు గ్రామం నుంచి ఖాజీపాలెం ఫంక్షన్‌కు వచ్చిన కంచర్ల శ్రావణి తిరిగి అమర్తలూరు ఆటోలో వెళుతుండగా చందోలులో ఆటో నుంచి జారి జాతీయ రహదారిపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలిసిన చందోలు ఎస్ఐ ఎం.వెంకట శివకుమార్ ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రురాలిని 108 వాహనం ద్వారా బాపట్ల ఏరియా వైద్యశాలకు పంపారు.

రహదారి ఇలా.. వాహనం కదిలేదెలా..?!



నగరం-శిరిపూడి రహదారిలో బురద మట్టిపై ద్విచక్ర వాహనదారుడి కష్టాలు

అక్రమ మట్టి తరలింపు వాహనాలతో వాహన చోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని శిరిపూడి, పెదమట్లపూడి, చినమట్లపూడి గ్రామాలలో జోరుగా అక్రమ మట్టి తరలింపు జరుగుతున్నది. మట్టి లోడుతో వెళుతున్న వాహనాల నుంచి మట్టి ప్రధాన రహదారులపై పడుతుండంతో ప్రమాదాలకు నెలవుగా మారింది. శిరిపూడి నుంచి నగరం వెళ్లే రహదారిలో బురద మట్టి పడటంతో వాహన చోదకులు నానా ఇక్కట్లు పడుతున్నారు. మట్టిపై ద్విచక్ర వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపై మట్టి పడకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

– నగరం



మట్టిపై జారి పడిన ద్విచక్ర వాహనదారుడు

గంజాయి విక్రేతల అరెస్ట్

తెనాలిరూరల్: పట్టణంలో ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్.రమేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు వివరాలను వెల్లడించారు. స్థానిక మారిస్‌పేట రేపల్లె రైలు గేట్ల సమీపంలో కొందరు గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీఐ రమేష్ బాబు సారథ్యంలో సిబ్బంది దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో గోరంట్లకు చెందిన నందిపాటి రాజశేఖరరెడ్డి, పేరేచర్లకు చెందిన తమనంపల్లి అరుణ్ కుమార్, తెనాలి పట్టణంలోని చినరావూరు తోటకు చెందిన దాసరి ప్రకాష్ బాబు ఉన్నారు. వారి నుంచి రూ.45 వేలు విలువ కలిగిన 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులలో ఒకరైన రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్ నాంపల్లిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి, స్నేహితుడైన అరుణ్‌కుమార్‌తో కలిసి తెనాలికి వచ్చి దాసరి ప్రకాష్‌బాబుని కలిశారు. ముగ్గురు గంజాయి సేవిస్తూ, దాని విక్రయంపై చర్చిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల్ని అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రమేష్ బాబు, ఎస్ఐ ప్రకాశ రావు, కానిస్టేబుళ్లు పి.మురళి, కె.బాబురావు, ఎస్.జయకర్, ఎన్.శ్రీనివాసరావులను ఎస్పీ సతీష్ కుమార్ అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశరావు

దోపిడీ కేసులో మైనర్ సహా ఇద్దరి అరెస్ట్

తెనాలిరూరల్: ఆటో ప్రయాణికుడిని అటకాయించి సెల్‌ఫోన్, నగదు దోచుకున్న ఘటనలో మైనరు సహా ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ బి.జనార్ధనరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. రూరల్ గ్రామం అంగలకుదురుకు చెందిన చుండి సుధాకర్ రావు దివ్యాంగుడు. గతంలో ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో పనిచేసి రిటైర్ అయ్యాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 5న రాత్రి కావలి వెళ్లేందుకు తెనాలి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అయితే వికలాంగుల కోటాలో రైల్వే కన్సిషన్ పాస్ మరిచిపోయిన నేపథ్యంలో ఆటో ఎక్కి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఆ సమయంలో ఆటోలో ఉన్న చినరావూరుతోటకు చెందిన నంబూరి గణేష్ అలియాస్ నాని, గుత్తికొండ నాగ రాకేష్ (బాల నేరస్తుడు) కలిసి ఆటోను మారిస్‌పేట ఎరువుల కొట్ల బజారులోకి తీసుకువెళ్లి, బాధితుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్, నగదును లాక్కొని, అతనిని ఆటో నుంచి కిందికి నెట్టి పారిపోయారు. బాధితుడు 6న పోలీసులను ఆశ్రయించడంతో ఏఎస్ఐ మురళి కేసు నమోదు చేశారు. మహాబ్ రోడ్‌లో ఉన్న నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి నేరానికి ఉపయోగించిన ఆటో, నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ వెల్లడించారు. సీఐ ఎస్.రమేష్ బాబు, ఎస్ఐ ప్రకాశరావు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

రోడ్లపై వ్యాపారాలు చేయవద్దు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న.



తెనాలిఅర్బన్: దుకాణదారులు తమ వ్యాపారాలను రోడ్లపై చేస్తే ఊరుకోబోమని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. పట్టణ పరిధిలోని 15,19,29 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొందరు వ్యాపారులు దుకాణాల బయట వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రజల రాకపోకలకు అవరోధం ఏర్పడుతుందన్నారు. తమ దుకాణాలలోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.